క్లుప్తంగా

ట్యాంకర్లతో నీటి సరఫరా



లక్ష్మీనగర్‌లో పర్యటిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్యాంకర్ల ద్వారా నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరంలోని బుడ్డప్పనగర్, మారుతీనగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్న తీరుపై స్థానికులను అడిగి మేయర్ తెలుసుకున్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. పీఏబీఆర్ డ్యాంలో నెల రోజుల్లోనే రెండు మోటర్లు చెడిపోవడంతోనే నీటి సరఫరా ఆలస్యమవుతోందన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాలతో నగరంలోని వివిధ ప్రాంతాలకు 12 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇసాక్, వైఎస్సార్ సీపీ నాయకులు షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన

అనంతపురం మెడికల్: స్థానిక సర్వజనాస్పత్రిలో బుధవారం ప్రజా ప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్‌పై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జస్టిస్ శ్రీనివాస రావు శాశ్వత లోక్ అదాలత్ ప్రాముఖ్యతను సిబ్బందికి విపులంగా తెలియజేశారు. కార్యక్రమలలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌లో ఇద్దరు మట్కా బీటర్లను అనంతపురం రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు సిండికేట్ నగర్‌కు చెందిన ఈశ్వరయ్య, షాకీర్ మట్కాకు సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్నారు. సీఐ రామకృష్ణారెడ్డికి పక్కా సమాచారం రావడంతో ఆయన ఆదేశాలతో సిబ్బంది వెళ్లి దాడులు చేశారు. ఈశ్వరయ్య, షాకీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నివాళి

రామగిరి: మండలంలోని పెనుబోలుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పక్కీర్‌రెడ్డి (70) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పక్కీర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

పోస్టల్ అసిస్టెంట్ సస్పెన్షన్

అనంతపురం సిటీ: అనంతపురంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆ శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ హరిబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు శాఖ వర్గాలు తెలిపాయి. ఓ కేసులో అరెస్ట్ అయ్యి.. రిమాండ్‌కు వెళ్లడంతో అతడ్ని సస్పెండ్ చేసినట్లు సమాచారం. గతంలో పని చేసిన పోస్టల్ సూపరింటెండెంట్ తన బంధువంటూ చెప్పుకుంటూ తరచూ విధులకు గైర్హాజరయ్యేవాడు. ఆ ఎస్పీ మారినా ఇతని పని తీరులో మార్పు రాకపోగా, పై అధికారుల మాట వినేవాడు కాదని ఉద్యోగులే చెబుతున్నారు. సదరు ఉద్యోగి పని తీరుపై గతంలో పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. అయినా అతను ఏమాత్రం మారలేదంటున్నారు. ఇప్పుడు ఇలా సస్పెన్షన్ కావడం ఆ శాఖలో పెద్ద చర్చనీయాంశమైంది.

ఓటింగ్‌పై అవగాహన



ఆత్మకూరులో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా బుధవారం ఆత్మకూరులో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానం, వీవీప్యాట్‌పై ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు, వీఆర్వో మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి

అనంతపురం రూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ కోరారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పరపల్లి సర్వే నంబర్ 198/8 ప్రభుత్వ భూమిలో దాదాపు 800 మంది గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు అందజేయాలన్నారు. ఏఓ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌వీ నాయుడు, రామిరెడ్డి, ముత్తుజా, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- జగనన్నతోనే సంక్షేమ పాలన
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 29వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



29వ డివిజన్‌లో పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగానే జిల్లా చరిత్రలో లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అనంతపురం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి జరిగింది. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం 29వ డివిజన్‌లోని సాయినగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. ఆ ప్రాంతంలోని ప్రతి ఇంటికి, వివిధ షాప్‌లకు వెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ప్రజలకు అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. గత ప్రభుత్వంలో ఎటువంటి గడ్డు పరిస్థితి, అలజడి వాతావరణం ఉందో ప్రజలకు వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు ఏవిధంగా నివసిస్తున్నారో తెలుసుకోవాలన్నారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమాన్ని అందించిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో పింఛన్ కోసం లబ్ధిదారులు నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే దయనీయమైన పరిస్థితి ఉండేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందు చూపుతో తీసుకువచ్చిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పింఛన్‌తో పాటు వివిధ పథకాలను అందించడం జరుగుతోందన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చారన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం..

గత టీడీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి ఏ పాటి ప్రాధాన్యత ఇచ్చిందో ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. చిన్నపాటి సమస్యకు కర్నూలు, బెంగళూరు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వచ్చేదన్నారు. అటువంటి ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడంతో పాటు సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రధానంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రెండు దశల్లో నియోజకవర్గంలోని ప్రతి ఇంటిని స్క్రీనింగ్ నిర్వహించి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి స్పెషలిస్టు, మెడికల్ ఆఫీసర్లతో వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా ఎంతో మందిలో బీపీ, డయాబెటీస్, తదితర సమస్యలు బయటపడ్డాయన్నారు. తద్వారా వారు అప్రమత్తమై ముందస్తు వైద్యం పొందేందుకు అవకాశం కల్పించారన్నారు. ఈ తరహాలో ఏ ప్రభుత్వం అయినా ప్రజలకు సేవ చేసిందో తెలుసుకోవాలన్నారు. వైద్య శిబిరాలను నిర్వహించడంతో పాటు జిల్లా ఆస్పత్రులు, హైయ్యర్ ఇన్‌స్టిట్యూట్‌కు రెఫర్ చేయడం జరిగిందన్నారు.

రూ.25 లక్షల వరకూ కార్పొరేట్ వైద్యం..

రూ.5 లక్షలున్న ఆరోగ్య శ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఖరీదైన వైద్యాన్ని పైసా ఖర్చు కాకుండా అందించేలా సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. వీటితో పాటు విద్యకు సంబంధించి నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. కార్పొరేట్ తరహాలో పాఠశాలలను తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా షూ, బ్యాగ్, పుస్తకాలు, తదితర వాటిని ఉచితంగా అందించారని తెలిపారు. ఇంత మేలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు బాలాంజినేయులు, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, దుర్గాదేవి, శ్రీనివాసులు, డైరెక్టర్లు జాహ్నవి, శోభారాణి, శ్రీనివాసులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, స్థానిక నాయకులు జావెద్, ఖాదర్‌బాషా, నారాయణరెడ్డి, శివయ్య, వంశీ, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట మధు, సాకే కుళ్లాయ స్వామి, రామయ్య, రవి, కృష్ణవేణి, రాధా, భారతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు 27, 29 డివిజన్లలో..

నగరంలోని 27, 29వ డివిజన్లలో గురువారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీసస్ నగర్‌లోని ఎస్‌వీ డిగ్రీ కళాశాల నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు.

కొలువుదీరిన కామితార్థద గణపతి



పూజల్లో పాల్గొన్న పీఠాధిపతులు

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన కామితార్థద గణపతి అనంతలో కొలువుదీరాడు. మహాపండితుడు సుంకేశుల సత్యనారాయణ నేతృత్వంలో మూడు రోజులుగా సాగుతున్న ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. కర్ణాటకకు చెందిన బాలకృష్ణానంద మహా సంస్థానం పీఠాధిపతి గోవిందానంద సరస్వతీ స్వామి ఆత్మీయ అతిథిగా విచ్చేసి అనుగ్రహ భాషణం చేశారు. భక్తిమార్గం విశిష్టత, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అగత్యాన్ని వివరించారు. అంతకు ముందు ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపనలు, ప్రతిష్ఠా హోమాలు, అష్టావధాన సేవ, ఉద్వసనా పూర్వక కుంభాభిషేకాలను స్వామీజీ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం నగరంలో కొలువుదీరిన కామితార్థద గణపతిని సర్వాంగ సుందరంగా అలంకరించిన పూలతేరుపై పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అన్నదాన సేవ, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. వందలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వివిధ ఆలయాల ప్రతినిధులు హోసూరు రామసుబ్రహ్మణ్యం, బద్రీనాథ్, పురుషోత్తమ మురళీకృష్ణ, డాక్టర్ నిర్మల, బ్రాహ్మణ సంఘం నాయకులు సూగూరు రఘునాథరావు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పర్యటన

రామగిరి: మండలంలోని పేరూరులో గురువారం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు సర్పంచ్ రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పేరూరు సమీపంలోని కురుగుండ్ల కాలనీలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి పక్కన గురువారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు మండల దళిత సంఘం నాయకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ విగ్రహావిష్కరణకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు అంధుల ఆదర్శ వివాహం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఇక్తూస్ ప్రార్థనా మందిరంలో గురువారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో అంధుల ఆదర్శ వివాహం జరిపిస్తున్నట్లు పాస్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే వివాహానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై అంధులను దీవిస్తారని పేర్కొన్నారు.

మోటర్ల రిపేరీతోనే నీటి సమస్య



విన్సెంట్ ఫెర్రర్ కాలనీలో పర్యటిస్తున్న జేసీ కేతన్‌గార్గ్, కమిషనర్లు భార్గవతేజ, మేఘస్వరూప్



బుడ్డప్పనగర్‌లో ట్యాంకర్ ద్వారా జరుగుతున్న నీటి సరఫరాను పరిశీలిస్తున్న దృశ్యం

- 10వ తేదీ నాటికి యథాస్థితికి నీటి సరఫరా
- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్
- కర్నూలు కమిషనర్ భార్గవతేజ, నగర కమిషనర్ మేఘ స్వరూప్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటన

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ డ్యాంలో ఉన్నఫలంగా రెండు మోటర్లు కాలిపోవడంతో నగర ప్రజలకందించే నీటి సరఫరాలో జాప్యం జరిగింది. భవిష్యత్తులో నీటి సరఫరాలో జాప్యం జరగకుండా డ్యాంలో మోటర్లను ఏర్పాటు చేయడంతో పాటు నూతన మోటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు జేసీ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా ఆలస్యంపై ప్రభుత్వం స్పందించింది. నీటి సరఫరా ఆలస్యానానికి గల కారణాలపై స్పష్టత ఇవ్వాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జేసీ కేతన్‌గార్గ్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ, అనంతపురం కమిషనర్ మేఘస్వరూప్ విన్సెంట్ ఫెర్రర్ కాలనీ, బుడ్డప్పనగర్‌లో పర్యటించారు. నీటి సరఫరాపై ఆరా తీశారు. గతంలో కంటే నీరు తక్కువ సమయం వదులుతున్నారని, నీరు ఫోర్స్‌గా రావడం లేదని ప్రజలు సమాధానం ఇచ్చారు. జాయింట్ కలెక్టర్, కమిషనర్లు మాట్లాడుతూ.. పీఏబీఆర్ డ్యాంలో ప్రస్తుతం రెండు మోటర్లతో మాత్రమే పంపింగ్ జరుగుతోందన్నారు. గతంలో 23 గంటల పాటు పంపింగ్ జరిగితే, ఇప్పుడు 20 గంటలు మాత్రమే పంపింగ్ జరుగుతోందన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నీటి సరఫరా జాప్యంతో పాటు ఆల్టర్‌నేట్ డేస్ సరఫరా జరుగుతోందన్నారు.

మోటర్ల మరమ్మతులకు చర్యలు..

కాలిపోయిన మరో మోటర్‌ను మరమ్మత్తు చేయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 500 హెచ్‌పీ మోటర్ల మరమ్మత్తు చేయాలంటే బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులు బెంగళూరులో మోటర్‌ను రిపేరీ చేయించేలా చర్యలు తీసుకున్నారన్నారు. నూతన మోటర్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. మార్చి 10వ తేదీ నాటికి యథాస్థితికి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నీటి ఆలస్యానికి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో 12 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పీఏబీఆర్ పరిశీలన..

స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఆదేశాలతో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ, అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ పీఏబీఆర్ డ్యాంను బుధవారం పరిశీలించారు. మోటర్ల సమస్యతోనే నీటి సరఫరా జాప్యం జరిగిందని నిర్ధారణకు వచ్చారు. ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, ఏఈ బాబావలి ఉన్నారు.

వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన..

మారుతీనగర్, విన్సెంట్ ఫెర్రర్ కాలనీ, బుడ్డప్పనగర్, మరువకొమ్మ కాలనీ, తదితర ప్రాంతాల్లో కమిషనర్ మేఘ స్వరూప్ బుధవారం పర్యటించారు. నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లను ఆదేశించారు.

హాస్య కథా చిత్రాన్ని ఆదరించండి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, భూమిరెడ్డి జాహ్నవిరెడ్డిని కలిసిన హీరో సాయిరాం

అనంతపురం కల్చరల్: పూర్తి హాస్యంతో తీసిన సినిమా 'వెయ్ దరువెయ్' చిత్రాన్ని ఆదరించాలని హీరో సాయిరాం శంకర్ ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ తమ్ముడు హీరో సాయిరామ్ శంకర్ బుధవారం సినిమా ప్రామోషన్ కోసం అనంతకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ భూమిరెడ్డి జాహ్నవి రెడ్డిని కలిశారు. సినిమా విజయవంతం కావడానికి సహకారమందించాలని కోరారు. మార్చి 15న రాష్ట్ర వ్యాప్తంగా సినిమా విడుదలవుతోందని ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లి చూడాలని కోరారు.


ఉమర్ ఆలీషా జీవితం స్ఫూర్తిదాయకం




ఉమర్ ఆలీషా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: మహాకవిగా, సంఘ సంస్కర్తగా, నాటక రచయితగా, పార్లమెంటు సభ్యుడిగా సూఫీ సిద్ధాంతాన్ని లోకానికి చాటిన మహాకవి డాక్టర్ ఉమర్ ఆలీషా అని సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ కొనియాడారు. బుధవారం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం షష్ఠమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా 139వ జయంతిని స్థానిక నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు రియాజుద్దీన్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ పతికి రమేష్ నారాయణతో పాటూ ద్విభాషా కవి జూటూరు షరీఫ్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్, ఎడుకేషనల్ సొసైటీ చైర్మన్ సుంకర రమేష్ తదితరులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. ఉమర్ ఆలీషా సాహిత్యాన్ని జిల్లాలో విస్తృతం చేయడానికి కృషి చేస్తామన్నారు. మానవతా విలువలను బోధించిన సద్గురువుల విశిష్ట వ్యక్తిత్వాన్ని తెలిపే జయంతి, వర్ధంతులు, సేవా కార్యక్రమాలను నిర్వహించాలని తీర్మానించారు. దశాబ్దానికి పైగా ఉమర్ సాహిత్యంపై సాగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అనంత వాసులు చూపిన ప్రతిభను పుస్తకాల రూపంలో తెచ్చామన్నారు. ఈ యేడాది అవార్డులనందుకున్న రమేష్ నారాయణను, భరత్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జయమారుతి, జీవన్‌కుమార్, సాయి పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి



అనంతపురం ఎడ్యుకేషన్ మాట్లాడుతున్న హైదరాబాద్ సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ సైంటిస్ట్ డాక్టర్ జీవన్‌కుమార్



ప్రాజెక్ట్ వివరాలు తెలుసుకుంటున్న ఎస్కేయూ వీసీ కే.హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య

అనంతపురం: శాస్త్ర, సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎస్కేయూ వీసీ కే.హుస్సేన్ రెడ్డి అన్నారు. ఎస్కేయూలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. సీవీ రామన్ కాంతి పరిక్షేపణ సిద్ధాంతం గురించి వివరించారు. అత్యుత్తమ జర్నల్స్ ప్రచురించే ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులకు చేయూతనిస్తామన్నారు. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో నిర్వహించిన పరిశోధన ప్రాజెక్ట్‌లను ప్రస్తావించి ప్రశంసించారు. ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ప్రొఫెసర్ ఆర్.రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతి వనరులను కాపాడుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య మాట్లాడుతూ.. పరిశోధనలకు కావాల్సింది డబ్బు కాదని, ఆసక్తి ప్రధానమన్నారు. కార్యక్రమాన్ని కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. వెంకటరమణ సమన్వయ కర్తగా, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమిరిటస్ ప్రొఫెసర్ ఆర్. రామకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సర్ సీవీ రామన్ గొప్పతనాన్ని పాట రూపంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి ఆలపించారు. కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఆర్. పద్మ సువర్ణ వ్యవహరించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ భువన విజయ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, ప్రొఫెసర్ వీబీ చిత్ర, ప్రొఫెసర్ సుబ్బారెడ్డి, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ శైలా కుమారి, డాక్టర్ కే.ఎఫ్. భారతి తదితరులు పాల్గొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కే. అరుణ (యూనిట్-2), కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదానం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా రక్తదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అనంత రాముడు మాట్లాడుతూ.. రక్తదానం అనేది ప్రాణ దానంతో సమానమన్నారు. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట రక్తం అవసరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రామమూర్తి, స్కిల్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సురేంద్ర నాయుడు, కళాశాల అకడమిక్ డీన్ రాయుడు పాల్గొన్నారు.

రాప్తాడు: హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ, కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఎండీ రమాకాంత్ రెడ్డి, ట్రెజరర్ శ్రావణి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపల్ విష్ణువర్దన్, ఏఓ వెంకట శివా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ డేను నగరంలోని వివిధ స్కూళ్లలో జరుపుకున్నారు. చిన్నారులు సైన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో నవోదయ కాలనీలోని గిరిజన గురుకుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పార్వతి అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక నగర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన, నగర అధ్యక్షకార్యదర్శులు రామిరెడ్డి, వీరరాజు, గాంగేనాయక్, విజయలక్ష్మి, రామకృష్ణ, ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, తిప్పేస్వామి పాల్గొన్నారు.



ఎస్‌వీఐటీ కళాశాల విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం



జేఎన్‌టీయూ క్యాంపస్‌లో రక్తనిర్ధారణ శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ



జేఎన్‌టీయూలో ఎమిరటర్స్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ